


పల్లెలపై.. పట్టింపేదీ?

చిల్లి గవ్వ లేక గ్రామపంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తం



- నిధులను నిలిపివేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- పైసలు రాక పనులు చేయడంలో ఇబ్బందులు
- 'స్వచ్ఛదనం- పచ్చదనం'కు డబ్బుల కొరత
- పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక రోగాల బారిన ప్రజలు
- మంత్రి సీతక్క చొరవ తీసుకోవాలని విన్నపం

హనుమకొండ టౌన్, ఆగస్టు 7: దేశానికి పట్టు కొమ్మలైన పల్లెల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. పంచాయతీలకు నిధుల్లేక పల్లెలన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పల్లెల అభివృద్ధిపై ప్రభుత్వానికి పట్టింపులేక పోవడంతో ప్రగతికి దూరంగా మగ్గుతున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయిన నాటి నుంచి పంచాయతీలకు కష్టాలు మొదలయ్యాయి. గ్రామపంచాయతీని నమ్ముకున్న వారంతా రోడ్డున పడ్డారు. కార్మికులతో పాటు సర్పంచ్‌లు తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలు, బకాయిల కోసం ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. అయినా ఇవేమీ పట్టించుకోని ప్రభుత్వం.. గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వకుండానే పనులు చేయాలని పంచాయతీ రాజ్ శాఖకు ఆదేశాలు జారీ చేస్తోంది. దీంతో కిందిస్థాయిలో ఉన్న కార్యదర్శులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మరోపక్క నిధులలేమి కారణంగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సమస్య జటిలమై.. ప్రజలు దోమకాటుకు గురై మంచాన పడుతూ ఆస్పత్రుల ఖర్చులు భరించలేక చివరికి ప్రాణాలు వదులుతున్నారు.

నిధులకు మంగళం

పల్లెల్లో ఏ అభివృద్ధి చేపట్టాలన్న కార్యదర్శులు గ్రామ ఆదాయాన్ని నమ్ముకొని పనులు చేయాలి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులను నిలిపివేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో సర్పంచ్, కార్యదర్శులు పంచాయతీని నెట్టుకొచ్చేవారు. ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఎనిమిది నెలలు కావస్తుండటంతో మార్చి నెల నుంచి కేంద్రం కూడా నిధులివ్వడం ఆపేసింది. దీంతో గ్రామ ఆదాయమే పంచాయతీలకు ఏకైక దిక్కుగా మారింది. ఖర్చులు ఎక్కువ, ఆదాయం తక్కువ కావడంతో అభివృద్ధిని గాడిలో పెట్టడం కార్యదర్శులకు సవాల్‌గా మారింది. పంచాయతీల్లో యేటా వచ్చే ఆదాయం రెండు, మూడు నెలలకు కూడా సరి పోవడం లేదని కార్యదర్శులు వాపోతుంటే.. మాతృశాఖమే జేబులో నుంచి పెట్టుకోవాలని ఒత్తిడి పెంచడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలోని గ్రామపంచాయతీలు

వరంగల్	323
హనుమకొండ	208
భూపాలపల్లి	241
ములుగు	174
మహబూబాబాద్	461
జనగామ	281
మొత్తం	1,688

స్వచ్ఛదనం-పచ్చ'ధనం'కు నిల్

సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినప్పటి నుంచి కార్యదర్శులు గ్రామాభివృద్ధికి తమ జేబులో నుంచి పెట్టుబడి పెట్టుకుంటూ వస్తున్నారు. సర్పంచ్‌లు ఉన్నంతసేపు వారే పెట్టుబడి పెట్టి పల్లెలను ప్రగతి పథాన నడిపించారు. అలా తాము పెట్టిన సొమ్ములను తిరిగి ఇవ్వలేదని సర్పంచ్‌లు, పని చేయించుకుంటూ పైసలు ఇస్తలేరని పంచాయతీ కార్మికులు వివిధ రూపాల్లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇవన్నీ తెలిసినా ప్రభుత్వం మాత్రం ఎలాంటి బడ్జెట్‌ను విడుదల చేయకుండా కొత్తగా స్వచ్ఛదనం- పచ్చదనం పథకాన్ని తీసుకొచ్చి కార్యదర్శులపై ఒత్తిడిని పెంచింది. ఐదు రోజుల కార్యక్రమాన్ని రూపొందించి ఒక్క పైసా విడుదల చేయకుండా కార్యదర్శులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, కార్యదర్శులు సైతం చేసేదేమీ లేక పల్లెల్లో నలుగురిని కలుపుకొని తూతూమంత్రంగా కార్యక్రమాన్ని నిర్వహించి ఐదు రోజుల కార్యక్రమంలో ఏ రోజుకారోజు మమ అనిపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పైసలు ఇవ్వకపోతే పాపం కార్యదర్శులు మాత్రం ఏం చేస్తారని ప్రజలు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. ఇక మాజీ సర్పంచులేమో తమ పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుండటంతో తాము అప్పులు తెచ్చిన చోట వడ్డీలు పెరుగుతున్నాయని వాపోతున్నారు.

ముందు పెట్టండి.. తర్వాత వస్తాయి..

8నెలల నుంచి పంచాయతీల్లోని చిన్న చిన్న అవసరాలకు కార్యదర్శులు వారి జేబుల్లో నుంచి డబ్బులు పెట్టుకుంటూ ఆర్థికంగా చతికిలపడతూ వస్తున్నారు. తాజాగా ఆగస్టు 5 నుంచి స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం చేపట్టి ఐదు రోజుల్లో ఒకొక్కరోజు ఒక కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. కానీ పనులు చేసేందుకు మాత్రం పైసలు లేవు.. మీరే జేబుల్లో నుంచి పెట్టండి.. తర్వాత మీ అకౌంట్స్‌కు జమ చేస్తామని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తుండటంతో కార్యదర్శుల పరిస్థితి మూలిగే నక్కమీద తాటికాయ పడ్డ చందంగా మారింది. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమానికి ముందు జిల్లా పంచాయతీ అధికారి నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో పలువురు కార్యదర్శులు తమ బాధలను విన్నవించుకున్నప్పటికీ.. తాను చేసేది ఏమీ లేదని, ఏమైనా ఉంటే కలెక్టర్‌కు చెప్పుకోండి.. అంటూ దాటేసినట్లుగా సమాచారం. జిల్లా పంచాయతీ అధికారి నుంచే సరైన మద్దతు లేనప్పుడు తమకు దిక్కెవరని కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు.

పల్లెల్లో రోగాల విజృంభణ

నిధుల లేమితో పల్లెల్లో దోమల నివారణకు పిచికారి, చెత్త సేకరణ అరకొరగా చేస్తున్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు అందక నిరసన బాట పట్టడం ఒకపక్క అయితే.. మరోపక్క చెత్త తరలించేందుకు ట్రాక్టర్లలో డీజిల్ పోయలేక మరోపక్క పల్లెల్లో శానిటేషన్ దుర్భరంగా తయారైంది. వర్షాకాలం నేపథ్యంలో మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగి చెత్తంతా జమై పల్లెల్లో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో దోమకాటుకు ప్రజలు మంచాన పడుతున్నారు. దీంతో ఇటీవల పల్లెల్లో జ్వరాలు పెరిగి డెంగీతో మరణించిన సందర్భాలు ఉన్నాయి. గ్రామాల అభివృద్ధికి సరిపడా నిధులను సమకూర్చి పల్లెల్లో ఆరోగ్య వాతావరణం కల్పించేలా పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అడకత్తెరలో..



- నిధుల లేమితో గ్రామ కార్యదర్శుల ఇబ్బందులు
- అప్పులు చేసి గ్రామాలను నెట్టుకొస్తున్న వైనం
- ఒక్కో కార్యదర్శికి రూ.లక్షకు పైగా ఖర్చు
- ప్రత్యేక పాలన ఆరంభం నుంచి ఇదే దుస్థితి

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 7: ఓ వైపు పని ఒత్తిడి.. మరో వైపు నిధుల లేమి.. అయినా తప్పదు గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి బాధ్యత మీదే అంటూ ప్రభుత్వ ఆదేశాలు.. వెరసి గ్రామ కార్యదర్శుల పరిస్థితి 'అడకత్తెరలో పోకచెక్క'లా తయారైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతోంది. ప్రత్యేక పాలన ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు గ్రామంలో ఎలాంటి సమస్యలు వచ్చినా వారి సొంతడబ్బు పెట్టుకుని పనులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇక మైనర్ గ్రామ కార్యదర్శుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. దీనికి తోడు ప్రభుత్వం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తుండటంతో ఇబ్బందులు రెట్టింపయ్యాయి. కొన్నిచోట్ల కార్యదర్శులతో పాటు స్పెషల్ ఆఫీసర్లు కూడా వారి సొంత డబ్బులు పెట్టుకుని మరీ కార్యక్రమాలను నెట్టుకొస్తున్నట్లు సమాచారం.

నిర్వహణ భారం

ఏడు నెలల నుంచి గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యత పూర్తిగా కార్యదర్శులపైనే పడింది. గ్రామంలో ఏ పనిచేయాలన్నా డబ్బులు లేకపోతే అంతే పరిస్థితి. వస్తున్న పన్నులు కార్యాలయ నిర్వహణ, సిబ్బంది జీతాలకే చాలడం లేదు. దీంతో కొన్ని నెలలుగా సిబ్బంది జీతాలు సైతం లేక విల విలలాడుతున్నారు. నీటి సరఫరా మొదలు.. పారిశుధ్యం, వీధిదీపాలు, చెత్త వాహనాల నిర్వహణ, ట్రాక్టర్ల ఈఎంఐలు ఇలా ఎన్నో ఇబ్బందులు పడుతూ పంచాయతీ పాలనను ముందుకు తీసుకెళ్తున్నారు. బోరు మోటార్లు బాగు చేయించడం, కల్వర్టులను శుభ్రం చేయించడం,

మిగతా 7వ పేజీలో..

నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం..

'ప్రత్యేక పాలన నుంచి పంచాయతీల్లో నిధుల కొరత ఉంది. ప్రస్తుతం జరుగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి సైతం ప్రత్యేక నిధులేమి లేవు. జీపీ నుంచి అన్ని కార్యక్రమాలకు డబ్బులు వెచ్చిస్తున్నాం. ఎలాంటి కార్యక్రమాలకైనా కార్యదర్శులమే జేబుల్లో నుంచి పెట్టుబడి పెడుతున్నాం. బ్యాంకుల్లో చెక్కులు కూడా పాస్ కావడం లేదు. ఇలా దాదాపు మేజర్, మైనర్ గ్రామ పంచాయతీల్లో రూ.లక్షకు పైగా డబ్బులు ఖర్చు చేసి ఉన్నాం' అంటూ ఓ పంచాయతీ కార్యదర్శి తన ఆవేదన వ్యక్తం చేశారు.

ఇబ్బందులు లేకుండా పనులు జరుగుతున్నాయి..

\- లక్ష్మీరమాకాంత్, జిల్లా పంచాయతీ అధికారి



స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఐదురోజుల పాటు గ్రామాలల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పల్లెలను శుభ్రంగా తయారుచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దానిలో భాగంగా ఈ నెల 5 నుంచి 3 రోజులుగా రోజుకొక్క కార్యక్రమంతో గ్రామాల్లో ఎలాంటి అటంకాలు లేకుండా కార్యదర్శులు విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోకి వెళ్లి పరిశీలిస్తే కార్యక్రమం ఏ విధంగా జరుగుతుందనేది అర్థమవుతుంది.

చేనేత కార్మికులకు అండగా నిలవాలి

- జాతీయ చేనేత దినోత్సవంలో కలెక్టర్ సత్యశారద



చేనేత దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, అధికారులు

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 7: చేనేత వస్త్రాల కొనుగోలు ద్వారా కార్మికులకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హనుమకొండలోని కాళోజీ సెంటర్ నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జడ్పీలో చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకోవడమే కాకుండా చేనేత పరిశ్రమ ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చేనేత కార్మికులు, చేతివృత్తులదారులు ఆర్థికంగా బలపడేందుకు ఉత్పత్తులను విరివిగా కొనుగోలు చేయాలని కోరారు. చేనేత వస్త్రాలు ఎంతో సౌకర్యవంతంగా ఉండటంతోపాటు పొల్యూషన్ ఫ్రీగా ఉంటాయన్నారు. చేనేత సొసైటీల బలోపేతంతో నేతదారుల ఆర్థిక లబ్ధికి దోహదపడుతుందన్నారు. చేనేత కార్మికులు వృత్తి నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి అవార్డుకు జిల్లా నుంచి ఆడెపు శ్రీనివాస్, సదానందం ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేనేత ఉత్పత్తుల స్టాల్‌ను సందర్శించి వస్త్రాలను కలెక్టర్ సత్యశారద పరిశీలించారు. అనంతరం చేనేత వస్త్ర వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, హైండ్లూమ్స్ ఏడీ జి.రాఘవరావు, చేనేతలు పాల్గొన్నారు.

ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 7: ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సత్యశారద, రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, మొౌకుంట్ల భారతి, రంగినేని శారద, బి.జ్యోతిలతో కలిసి ఆహార భద్రతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు రోజులుగా జిల్లాలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలు, రేషన్ దుకాణాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. పేదలు, విద్యార్థులు, గర్భిణులకు ఆహార భద్రత కింద అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు అందాలని సూచించారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా మెనూ ప్రకారం అందించాలన్నారు. సరైన ఆహారం అందించకపోతే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

వృద్ధులకు బయోమెట్రిక్‌లో వేలి ముద్ర పడకపోవడం వల్ల రేషన్ షాపుల నుంచి బియ్యం తీసుకోలేక పోతున్నామని కమిషన్ దృష్టికి రాగా, పై అధికారులతో చర్చించనున్నట్లు కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తెలిపారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ రాష్ట్ర ఫుడ్ కమిషన్ క్షేత్రస్థాయి తనిఖీల్లో గుర్తించిన లోటుపాట్లను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే సరిచేసుకోవాలన్నారు. కేజీ బీవీ విద్యార్థుల హాస్టళ్ల మెనూ కోసం 2017లో నిర్ణయించిన ధరల ప్రకారం నిత్యావసర వస్తువులు మంజూరు చేస్తున్నారని, దీనిని రివైజ్ చేయాల్సిన అవసరం ఉందని కోరారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఎస్‌వో శివప్రసాద్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా 2వ ఆర్థిక సంఘం సమీక్ష



మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 7: స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ఉమ్మడివరంగల్ జిల్లా 2వ ఆర్థిక సంఘం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ.. గ్రామీణ స్థానిక సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. గ్రామీణ, పట్టణ సంస్థల అభివృద్ధికి కావాల్సిన నిధులను సమకూర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్ర స్థానిక సంస్థల అభివృద్ధికి నిధుల మంజూరులో జాప్యం లేకుండా సిఫారసు చేసిన నిధులను మంజూరయ్యేలా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు నిధులు కేటాయించామన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243ఎల్, 243వై ఆదేశం ప్రకారం మన రాష్ట్రంలోని అన్ని గ్రామీణ స్థానిక సంస్థలు, పట్టణాల ఆర్థిక స్థితిగతులను సమీక్షించడానికి, ఆర్థిక వనరుల పంపిణీ సిఫారసు చేయడానికి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసిందన్నారు. గ్రామ పంచాయతీల అధికారుల విధులు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 52 ప్రకారం గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు మరిచిపోవద్దని రాజయ్య పేర్కొన్నారు. ప్రతీ గ్రామానికి అవసరమయ్యే

(మిగతా 8వ పేజీలో)

చైన్‌స్నాచింగ్ పని గంజాయి గ్యాంగ్‌దే?

- పోలీసుల అదుపులో ఇద్దరు అనుమానితులు
- భూపాలపల్లి, హైదరాబాద్‌కు ప్రత్యేక పోలీసు బృందాలు
- సీసీ ఫుటేజీలకు దొరకకుండా ద్విచక్ర వాహనంపై ప్రయాణం



మట్టెవాడ, ఆగస్టు 7: గత నెల 30న వరంగల్ జిల్లా కేంద్రం మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తవాడకు చెందిన వనజ అనే మహిళ మెడలోని చైన్‌ను దుండగులు చోరీ చేశారు. అయితే ఈ చైన్‌స్నాచింగ్‌కు పాల్పడింది గంజాయి గ్యాంగేనని సీసీఎస్, మట్టెవాడ పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. అదేవిధంగా ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చౌదపూడి దుకాణంలో మహిళ మెడలో నుంచి బంగారు చైన్‌ను దొంగిలించింది మరో గ్యాంగ్ అని నిర్ధారణ కొచ్చారు. ఒకే రోజు వేర్వేరు గ్యాంగ్‌లు అటు కొత్తవాడ ఇటు మెదరివాడలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. అయితే కొత్తవాడలో స్కూటీపై వచ్చి మహిళ మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లిన వారిని గుర్తించేందుకు పోలీసులు వారం రోజులుగా నగరంలోని సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నారు. ఇప్పటికే వందలాది సీసీ ఫుటేజీలను పరిశీలించారు. కానీ ఈ రెండు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన దుండగులు సీసీ ఫుటేజీలకు దొరకకుండా జాగ్రత్త పడ్డారని, వారు వచ్చిన, వెళ్లిన రూట్‌ను గుర్తించకుండా ద్విచక్ర వాహనంపై ప్రయాణించి తప్పించుకున్నారని పోలీసులు గుర్తించారు. వారు నగరంలో చేసిన జిగ్‌జాగ్ ట్రావెలింగ్‌తో ఎక్కడా సీసీ కెమెరాల్లో సరిగ్గా రికార్డు కాలేదు.

స్నాచర్ల కీలక సమాచారం లభ్యం

కొత్తవాడలో జరిగిన చైన్ స్నాచింగ్‌కు సంబంధించిన సీసీఎస్, మట్టెవాడ పోలీసులు కొంత పురోగతి సాధించినట్లు తెలిసింది. చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితులిద్దరూ భూపాలపల్లి నుంచి వరంగల్‌కు వచ్చి కొత్తవాడలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడి జిగ్‌జాగ్ రూట్‌లో వరంగల్ ఎంజీరోడ్డు నుంచి ములుగు రోడ్డు మీదుగా తిరిగి భూపాలపల్లికి వెళ్లినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు సీసీ ఫుటేజీలను మంగళవారం రాత్రి పరిశీలించడంతో కొంత కీలక సమాచారం లభించింది. దీంతో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుల స్నేహితుడు ములుగు రోడ్డులోని ఒక హాస్టల్‌లో ఉంటున్నట్టు సమాచారం. దీంతో మంగళవారం రాత్రి సీసీఎస్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా హాస్టల్‌లోని నిందితుల స్నేహితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వెల్లడించిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి సీసీఎస్, మట్టెవాడ పోలీసుల బృందం భూపాలపల్లికి వెళ్ళి చైన్ స్నాచర్ల కోసం గాలించారు. కొత్తవాడలో స్నాచింగ్‌కు పాల్పడిన నిందితులు ఆరోజు రాత్రి వరంగల్‌లో ప్రైవేట్ హాస్టల్‌లో ఉన్న మిత్రుడిని కలిసినట్టు పోలీసులకు పక్కా సమాచారం అందడంతో భూపాలపల్లికి వెళ్లారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితులు బంగారు గొలుసును ఎక్కడ విక్రయించారనే విషయంపై ప్రత్యేక పోలీస్ బృందం బుధవారం హైదరాబాద్‌కు వెళ్లింది. కొత్తవాడ చైన్ స్నాచింగ్‌కు సంబంధించి గంజాయి గ్యాంగే ఈ పని చేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చి భూపాలపల్లికి చెందిన అనుమానితులు విచారిస్తున్నట్టు తెలిసింది. ఎక్కడెక్కడ చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారనే కోణంలో విచారణ చేస్తున్నట్లు సమాచారం. భూపాలపల్లి టు వరంగల్.. వరంగల్ టు భూపాలపల్లికి స్కూటీపైనే స్నాచర్లు వెళ్లినట్లు తెలిసింది.

చెరువుల్లో గుర్రపు డెక్కలు తొలగించాలి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 7: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 9 చెరువులు, కుంటలలో గుర్రపు డెక్కలు పెరిగి పరిసరాలు కలుషితమవుతున్నాయని, చెరువుల్లో మొలిచిన గుర్రపు డెక్కలను వెంటనే తొలగించాలని చెరువులు, ఆక్రమణ ఏరియాల పరిరక్షణ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్ వెల్లడించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి వినతి పత్రం సమర్పించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘం నాయకులు నగేశ్, వెంకటేశ్వర్లు, క్రాంతి ఉన్నారు.

అడకత్తెరలో 'కార్యదర్శి'

(5వ పేజీ తరువాయి)

పైపులైన్ లీకేజీలు అరికట్టడం, చేతిపంపులు పాడైతే సరిచేయడం, నీటి ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్, ఇలా గ్రామంలో తర చూ ఏర్పడే సమస్యలనీ కార్యదర్శులే సొంత డబ్బులు పెట్టుకొని చేయాల్సి వస్తోంది. నిధులు జీపీలో లేకపోవడం వల్ల ఈ సమస్య ఉందని చెప్పకనే చెబుతున్నారు. ఈ వెతలు ప్రభుత్వం నియమిం చిన ప్రత్యేకాధికారులకు సైతం కొన్ని చోట్ల లేకపోలేదు. తమ జీతాల్లో నుంచి ప్రతీ నెలా జీపీకి ఖర్చుపెట్టే వారు కూడా ఉన్నారు.

మార్చిలో కేంద్ర నిధులు

ప్రత్యేక పాలన ప్రారంభమైన తర్వాత ఈ ఏడాది మార్చి నెలలో కేంద్రం జీపీలకు నిధులు విడుదల చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు విడుదల కాలేదు. ఇక రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులు కూడా అందకపోవడంతో గ్రామ పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. కొన్ని నెలల పాటు మార్చిలో వచ్చిన కేంద్ర నిధులతో పంచాయతీలు నడిచినప్పటికీ, ముఖ్యంగా మైనర్ పంచాయతీలకు ఇబ్బందులే తలెత్తాయి. మేజర్ గ్రామ పంచాయతీలకు కొంత మేర డబ్బులు ఎక్కువగా విడుదల కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. కానీ, ప్రస్తుతం ఇప్పుడు అందరి పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

భారమైన స్వచ్ఛదనం-పచ్చదనం

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం గ్రామాల్లో ఈనెల 9వరకు జరగనుంది. ఈ కార్యక్రమాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులే తమ భుజస్కంధాలపై వేసుకున్నారు. ఉదయం లేచిన నుంచి సాయంత్రం వరకు కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా వాటికి అయ్యే ఖర్చులు పూర్తిగా భరించడం వారి బాధ్యతే. ఇప్పటికే నిధులు లేక ఇబ్బందులు పడుతున్న సెక్రటరీలకు ఈ ప్రోగ్రామ్ పెద్ద సవాల్‌గా మారింది. ఏ పనులు చేయాలన్నా డబ్బులతో ముడిపడి ఉన్న అంశం కావడంతో కార్యదర్శులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ, జిల్లా ఉన్నతాధికారుల విజిటింగ్, కార్యక్రమాలు చేసేందుకు ప్రజలను తీసుకురావడం, పనులు చేసేందుకు ప్రైవేటు వ్యక్తులను కూలీకి తీసుకురావడం, మిషనరీ ఏర్పాటు, దోమల మందులు, బ్లీచింగ్, డోజర్ కిరాయిలు ఇలా ఎన్నో పనులకు డబ్బులు కార్యదర్శులు పెట్టుకోవాల్సి వస్తోంది.

రూ.లక్షకు పైగా ఖర్చు

మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు మైనర్ గ్రామ పంచాయతీల ఖర్చులు కొంచెం అటు ఇటుగా ఉన్నా వసతుల కల్పనలో సమానంగా ఉంటున్నారు. దీంతో జీపీ కోసం పెట్టే ఖర్చు ఇప్పటికే ఒక్కో కార్యదర్శికి రూ.లక్షకు పైగా దాటిందని తెలుస్తోంది. కొన్ని పనులకు ఎంబీ రికార్డులు చేయించి మరీ సిద్ధంగా ఉన్నారు. కానీ, గ్రామంలో మౌలిక వసతుల కల్పన కోసం పెట్టే ఖర్చులు రాసి పెట్టుకుంటున్నారు. దీంతో తమ జీతాలే కాకుండా బయట తెలిసిన వ్యక్తుల వద్ద అప్పులు చేసి గ్రామాలను నెట్టుకొస్తున్నారు. వీరికి సహకారంగా కొన్ని చోట్ల ప్రత్యేక అధికారులు చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

ఖాతాల్లో డబ్బులు ఫ్రీజ్

కొన్ని గ్రామపంచాయతీల్లో నిధులు ఉన్నప్పటికీ వాటిని విడుదల చేసేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఖాతాల్లో ఉన్న డబ్బులు తీసేందుకు చెక్కులతో బ్యాంకుకు వెళ్తే పాస్ కావడం లేదు. దీనిపై అధికారికంగా జిల్లా పంచాయతీ అధికారులు ధ్రువీకరించనప్పటికీ ప్రస్తుతం కార్యదర్శులు ఎదు ర్కొంటున్న సమస్యలు ఇవే. డబ్బులు ఉన్నట్లు చూపుతున్న ప్పటికీ వాటిని డ్రా చేసేందుకు మాత్రం వీలు లేదు. దీంతో మరింత ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో గ్రామంలో కొన్ని పనులు చేసి వాటిని తీసుకోని సదరు కాంట్రాక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులకు సైతం ఈతిప్పలు తప్పడం లేదు.

రాజకీయ ఒత్తిడి

ప్రత్యేక పాలన ప్రారంభమైన నాటి నుంచి కార్యదర్శులకు రాజకీయ ఒత్తిడి కూడా ఎక్కువైందనే చెప్పాలి. సర్పంచ్ లేకపోవడంతో ఏ చిన్న సమస్య ఏర్పడినా ఇటు ప్రజలతో పాటు ఇతర అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామా ల్లో చోటామోటా నాయకులు కార్యదర్శినే ప్రశ్నిస్తున్నారు. తమ కాలనీకి నీళ్లు రావడం లేదనో, స్ట్రీట్ లైట్ వెలగడం లేదనో, దోమల మందు కొట్టడం లేదనో ఏదో విధంగా కార్యదర్శిని ఏకంగా బెదిరింపులకు సైతం దిగుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దృష్టి సారించి ప్రత్యేక నిధులు అందించి ఇబ్బందులు లేకుండా చేస్తే బాగుంటుందని కోరుతున్నారు.

రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 7: హనుమకొండ ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీలో 50 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫార్మసీ, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 30 యేళ్ల వయస్సుగల నిరుద్యోగులు అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7893394393లో సంప్రదించాలన్నారు.

తెలుగులో సంపత్‌రెడ్డికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పరిశోధకుడు వంగాల సంపత్‌రెడ్డి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు బుధవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి సంపత్‌రెడ్డికి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'చెరబండరాజు నవలలు, కథలు - తెలంగాణ జనజీవితం' అనే అంశంపై కేయూ మాజీ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే పర్యవేక్షణలో వంగాల సంపత్‌రెడ్డి పరిశోధన పూర్తి చేశారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వీరు అనేక అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ సాధించిన వంగాల సంపత్‌రెడ్డిని నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల హిందీ లెక్చరర్ కొమురారెడ్డితో పాటు పలువురు అభినందించారు.

అంతర్జాతీయ సెమినార్‌కు సంకినేని వెంకట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్‌కు ఈనెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు బుధవారం సెమినార్ నిర్వాహకులు వెంకట్‌కు ఆహ్వానం పంపినట్లు తెలిపారు. 'ట్రైబల్ లైవ్‌లీ వుడ్ ఫార్మన్స్ ఇష్యూష్ స్ట్రాటజీస్ ఫర్ ఇంపవర్‌మెంట్' అనే అంశంపై జరిగే సదస్సులో డాక్టర్ సంకినేని వెంకట్ 'డెమోక్రటైజేషన్ ఇన్ ట్రైబల్ ఏరియాస్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పిస్తారు. ఈ సందర్భంగా వెంకట్‌ను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, రాజనీతిశాస్త్ర అధ్యాపకులు అభినందించారు.

డాక్టర్ అడ్లూరికు భారత్ సేవా పరస్కారం



హనుమకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణిత శాస్త్రవేత్త, గణిత అవధాని డాక్టర్ అడ్లూరు నర్సింహమూర్తికి బెంగుళూరుకు చెందిన వెయిల్ ఫౌండేషన్ ఇండియా భారత సేవా పురస్కారానికి ఎంపిక చేసింది. నాలుగు దశాబ్దాలుగా గణిత రంగంలో చేసిన విశేషసేవలకు, చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఆయన ప్రతిష్ఠాత్మకమైన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. డాక్టర్ అడ్లూరు గణితంపై రాసిన పదమూడు పరిశోధనా వ్యాసాలు వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఆయనను ఇప్పటికే పలు అవార్డులు వరించాయి. ముంబైకి చెందిన ఎంపీఎల్‌పి ట్రస్ట్ రాష్ట్రీయ ఆచార్య శిరోమణి అవార్డును, కిందటేడు గోవా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టర్‌ను ప్రదానం చేశాయి. గణిత అష్టావధానాలతో గుర్తింపు పొందిన డాక్టర్ నర్సింహమూర్తి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కించుకున్నారు. మదర్ థెరిస్సా అవార్డును అందుకున్నారు.

'సినారె' పురస్కారానికి మహేందర్ ఎంపిక



హనుమకొండ కల్చరల్, ఆగస్టు 7: హనుమకొండ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు బిల్ల మహేందర్‌కు రాష్ట్ర స్థాయిలో అందించే సినారే పురస్కారం-2024కు ఎంపికయ్యారని సంస్థ అధ్యక్షుడు మడకెల్లి రాములు, నిర్వాహకులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మహాకవి సినారే కళాపీఠం యేటా డాక్టర్ సి.నారాయణరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో సాహిత్య రంగంలో విశేషకృషి చేసిన వారిని ఎన్నికచేసి ఈ పురస్కారాన్ని అందిస్తున్నారు. దానిలో భాగంగా జిల్లా నుంచి మహేందర్‌కు ఈ యేడు పురస్కారం లభించింది. పదిహేనేళ్లుగా మహేందర్ వివిధ ప్రక్రియలో సాహిత్య సేవ చేస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ సామాజిక, సమకాలిన అంశాలపై ఆరు కవితా సంపుటాలతో పాటుగా తన సంపాదకత్వంలో నాలుగు సంకలనాలను అచ్చు వేశారు. ఈ నెల 10న హైదరాబాద్‌లో సినారే కళా పీఠం వారి ఆధ్వర్యంలో తెలంగాణ తొలి సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా ఈ సత్కారం జరుపబడుతుందని నిర్వాహకులు తెలియజేశారు. మహేందర్‌కు పురస్కారం లభించడంపై ఓరుగల్లు కవులు, రచయితలు, ఉపాధ్యాయులు సంతోషంతో పాటు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మంత్రి నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సామల సదానందం



మంత్రి నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆడెపు శ్రీనివాస్

ఇద్దరు నేతన్నలకు రాష్ట్ర స్థాయి అవార్డులు

హైదరాబాద్‌లో అందజేసిన మంత్రి తుమ్మల

ఆటోనగర్ (వరంగల్), ఆగస్టు 7: జాతీయ చేనేత కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో బుధవారం వేడుకలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి చేనేత జౌళి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ క్రమంలో వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడకు చెందిన ఇద్దరు చేనేత కార్మికులు సామల సదానందం, ఆడెపు శ్రీనివాస్‌కు ఆయన కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి అవార్డులతో పాటు రూ.25వేల నగదు బహుమతిని చెక్కుల రూపంలో అందజేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి చేనేత కార్మికుల పోటీల్లో సామల సదానందం(సీఎం రేవంత్‌రెడ్డి బొమ్మ), ఆడెపు శ్రీనివాస్(మహాత్మా గాంధీ బొమ్మ)ల డిజైన్లను నేసి ప్రదర్శించినందుకు గాను ఈ అవార్డులకు ఎంపికయ్యారు. అనంతరం వరంగల్ కార్పెట్లను వివిధ దేశాలకు, దేశంలోని వివిధ రాష్ట్రాలకు సొంత మార్కెట్ వ్యవస్థను నెలకొల్పి చేనేత కార్మికులకు నూతన డిజైన్ల ఆర్డర్లను ఇప్పిస్తూ చేనేత కార్మికులకు పనికల్పిస్తున్న వరంగల్ కొత్తవాడకు చెందిన యువకుడు చిప్ప కిరణ్‌కుమార్ నేతను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పప్పుల వెంకటేశం, డిప్యూటీ డైరెక్టర్ ఇందుమతి, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వరు, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, నాయకులు ఎం.రవికుమార్, వరలక్ష్మి, రూప తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఎస్డీఎల్‌సీఈ ఎంఎస్‌డబ్ల్యూ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఆగస్టు7: కాకతీయ యూనివర్సిటీ మాస్టర్ ఆఫ్‌సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) ఫైనల్ ఇయర్ పరీక్షలు ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో రివైజ్డ్ పరీక్షల షెడ్యూల్‌ను వెల్లడించారు. ఆగస్టు 17, 20, 24, 28, 30, సెప్టెంబరు 2వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. అభ్యర్థులకు క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షలకేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

13 నుంచి దూరవిద్య బీఎల్ఐఎస్సీ పరీక్షలు

ఈనెల 13 నుంచి బ్యాచ్‌లర్ ఆఫ్ లైబ్రరీ ఇన్ఫర్మేష న్ సైన్స్ (బీఎల్ఐఎస్సీ) ఎక్స్‌అభ్యర్థుల రివైజ్డ్ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఆగస్టు 13, 16, 19, 21, 23, 27, 29 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగు తాయని పేర్కొన్నారు. అలాగే ఆగస్టు 30న మధ్యాహ్నం ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

13 నుంచి బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు


ఈనెల 13నుంచి కేయూ బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయి. ఆగస్టు 13, 16, 19, 21 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాల, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కేయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు షురూ

కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని పీజీ కోర్సుల ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్) రెండో సెమి స్టర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షలు ఆగస్టు 7, 9, 12, 14, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. వర్సిటీ పరిధిలో 5,150 మంది పరీక్షలు రాయనున్నారు. బుధవారం పరీక్షల నిర్వహణను పరీక్షల నియంత్రణాధికారులు పరిశీలించారు.



నిండుకుండలా లక్నవరం చెరువు



మత్తడి దుంకుతున్న లక్నవరం జలాలు

లక్నవరం చెరువుకు మత్తడి

గోవిందరావుపేట, ఆగస్టు 7: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ప్రఖ్యాత లక్నవరం చెరువు మత్తడి పోస్తోంది. 33.6 అడుగుల నీటినిల్వ సామర్థ్యం కలిగిన చెరువు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోగా ఎగువ నుంచి పెద్దఎత్తున వరద పోటెత్తడంతో బుధవారం ఉదయం నుంచి 5 సెంటీమీటర్ల ఎత్తులో జలాలు మత్తడి దునుకుతున్నాయి. దీంతో దయ్యాలవాగులో ప్రవాహం పెరిగింది. కొత్తగూడ, గంగారం అటవీ ప్రాంతం నుంచి, బొగ్గుల వాగు నుంచి లక్నవరానికి వరద కొనసాగుతోంది.

నిండా నీటితో కళకళలాడుతున్న లక్నవరం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. తేలికపాటి వర్షాలు కురుస్తుండటం, సందర్శనకు ఆంక్షలు లేకపోవడంతో చెరువులో బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలను తిలకించేందుకు టూరిస్టులు తరలిరానున్నారు.



జలకళతో పాకాల సరస్సు



మత్తడికి చేరువైన నీరు

మత్తడికి చేరువలో పాకాల చెరువు

ఖానాపురం, ఆగస్టు 7: వరంగల్ జిల్లాలోనే సాగునీటి వనరుల్లో పెద్దదైన పాకాల సరస్సు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. సరస్సు జలకళను సంతరించుకొని మత్తడికి చేరువలోకి వచ్చింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సు బుధవారం నాటికి 29.8 అడుగుల నీటిమట్టానికి చేరుకుని నిండు కుండలా ఉంది. సరస్సు పూర్తి నీటి సామర్థ్యం 30.2 అడుగులు కాగా, మరో ఆరు ఇంచుల నీరు చేరితే మత్తడితో పరవళ్లు తొక్కనుంది. పాకాల ఆయకట్టులో వరినాట్లు జోరుగా సాగుతున్న తరుణంలో ఆయకట్టు రైతులు జలకళను సంతరించుకున్న పాకాల సరస్సును సందర్శించి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గూడూరు మండలం భీమునిపాదం జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

ఉప్పొంగుతున్న భీమునిపాదం

జలపాతం వద్ద పర్యాటకుల సందడి

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 7 : ఎత్తైన గుట్టలు, ఆరుదైన వృక్షాలు, అబ్బురపరిచే భీమునిపాదం జలపాతం వద్ద పర్యాటకుల సందడి పెరిగింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప అటవీప్రాంతంలో ఉన్న భీముని పాదం జలపాతం 70 ఫీట్ల ఎత్తునుంచి వాటర్‌ఫాల్స్ జాలువారుతున్నాయి. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షానికి భీమునిపాదంలో వాటర్‌ఫాల్స్ ఉధృతంగా జాలువారుతున్నాయి. పచ్చని ప్రకృతి నడుమ, ఆహ్లాదకరమైన వాతావరణంలో వాటర్‌ఫాల్స్ కింద తడుస్తూ పర్యాటకులు కేరింతలు కొడుతున్నారు. భీమునిపాదంలో పచ్చని ప్రకృతిని ఆస్వాదించడానికి వాచ్‌టవర్ కూడా నిర్మించిన విషయం విదితమే. బుధవారం కురిసిన వర్షానికి భీముని పాదంలో వాటర్‌ఫాల్స్ భారీస్థాయిలో జాలువారుతుండడంతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. హన్మకొండ నుంచి భీమునిపాదంకు కేవలం 70 కిలోమీటర్లు, మహబూబాబాద్ నుంచి 40 కిలో మీటర్లు ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు, అటవీశాఖసిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కేయూ డిగ్రీ విద్యార్థులకు ఇన్‌స్టంట్ అవకాశం

- 6వ సెమిస్టర్ ఏదైనా ఒక్కపేపర్ తప్పిన వారికే..
- 12 వరకు ఫీజు గడువు.. 17న పరీక్ష..

కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ విద్యార్థులకు వర్సిటీ అధికారులు సువర్ణ అవకాశాన్ని కల్పించారు. ఇటీవల నిర్వహించిన డిగ్రీ 6వ సెమిస్టర్‌లో ఏదైనా ఒకే ఒక్క పేపర్ తప్పిన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రత్యేకంగా ఇన్‌స్టంట్ పరీక్షను నిర్వహిస్తారు. వర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ తదితర కోర్సుల్లో ఆఖరు సెమిస్టర్‌లో ఏదైనా థియరీ పేపర్‌లో తప్పిన అభ్యర్థులు ఆగస్టు12 వరకు ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలదేవి బుధవారం తెలిపారు. బీఏ, బీకామ్, జనరల్ (బీఏ లాంగ్వేజేస్) అభ్యర్థులు రూ.450, బీఏ, బీబీఏ, బీకాం, బీఎస్సీ, కంప్యూటర్ అభ్యర్థులు రూ.550, బీసీఏ అభ్యర్థులు రూ. 650, బీకామ్ వోకేషనల్ రూ.720 కళాశాలలో చెల్లించుకోవాలని తెలిపారు. ఫీజులు చెల్లించుకున్న అభ్యర్థులకు ఆగస్టు 17న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. కాగా, కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్‌లో ఎల్‌బీ కళాశాల, హనుమకొండలో వాగ్దేవి డిగ్రీ కళాశాల, ఉమ్మడి ఆదిలాబాద్ మంచిర్యాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాయ్స్) ఉమ్మడి ఖమ్మంలో పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖమ్మంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గర్ల్స్ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు.





ఆర్ఏఆర్ఎస్‌లో మొక్కలు నాటుతున్న డాక్టర్ ఉమారెడ్డి

ఆర్ఏఆర్ఎస్‌లో వనమహోత్సవం

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 7: వరంగల్ ములుగు రోడ్డులోని వ్యవసాయ ప్రాంతీయ పరిశోధనా స్థానంలో బుధవారం వనమహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. మొక్కలు నాటి పరిరక్షించినప్పుడే లక్ష్యం నెరవేరినట్లు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సైంటిస్టులు, నాన్ టీచింగ్ స్టాఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే నరేందర్



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

వరంగల్ సిటీ, ఆగస్టు 7: వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తన జన్మదిన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం మాజీ సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కేసీఆర్ నరేందర్‌ను మరింత ఉన్నత స్థితికి ఎదగాలని దీవించారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. ఉద్యమకాలం నుంచి కేసీఆర్‌తో ఉన్న అనుబంధాన్ని విడిచిపెట్టకుండా అధికారంలో ఉన్నా.. లేకున్నా ఏటా ఆయన వద్దకు వెళ్లి ఆశీర్వాదం తీసుకుంటానని చెప్పారు.

మార్కెట్‌ను సందర్శించిన జేడీఎం

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 7: ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన వరంగల్ రీజియన్ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీఎం), ఏనుమాముల మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జ్ ఉప్పుల శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ వి.పద్మావతి, డీఎంవో అనురాధ బుధవారం తొలిసారి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, గ్రేడ్-2 కార్యదర్శులు రామోజు రాము, అజిత్‌రావు, ఏఎస్ రాజేందర్ తదితరులు వారిని శాలువాలతో సత్కరించారు. అనంతరం జేడీఎం శ్రీనివాస్ మార్కెట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

రేషన్ బియ్యం పట్టివేత

సంగెం, ఆగస్టు 7: పేదలకు పంపిణీ చేసిన రేషన్ బియ్యంను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువకు అమ్మేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నరేష్ తెలిపిన ప్రకారం... మండలంలోని నల్లబెల్లి శివారులో గల కొత్తపల్లిలో పేదలకు పంచాల్సిన బియ్యం నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు బుధవారం పోలీస్ పెట్రోలింగ్ పార్టీ గ్రామాన్ని సందర్శించింది. బియ్యం నిల్వ ఉంచిన గోనె మహేందర్ ఇంటి యాజమానిని విచారించగా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గుల్లపల్లి విజేందర్ రేషన్‌కార్డుదారుల నుంచి తక్కువ ధరకు కొని పౌల్ట్రీఫాంలకు ఎక్కువ ధరకు విక్రయించేందుకు నిల్వ చేసి 104 ప్లాస్టిక్ సంచుల్లో ఉన్న 52 క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. అదే గ్రామంలో ముస్కు రాజు ఇంట్లో 70 బస్తాల్లో 35 క్వింటాళ్ల బియ్యం లభ్యమైనట్లు చెప్పారు. ఇద్దరి వద్ద లభించిన 87 క్వింటాళ్ల బియ్యం విలువ రూ1.39లక్షలు ఉంటుందన్నారు.

స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి పనుల వివరాలు పూర్తి సమాచారం భద్రపరుచుకునేలా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలోని ఆస్తి పన్నుపై మళ్లీ పూర్తి సమీక్ష చేయాలన్నారు. విద్యుత్ చార్జీల అధిక బారం పడకుండా ప్రతీచోట సోలార్ పవర్ ప్లాంట్లను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతీ గ్రామ పంచాయతీలో క్రమం తప్పకుండా ప్రతీ 60 రోజుల్లో గ్రామసభ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్య, ఇతర అభివృద్ధి పనులకు సకాలంలో నిధులు అందుబాటులో ఉన్నట్లయితే ప్రతీ పనిని త్వరితగతిన పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా ఆర్థిక సంఘం జిల్లాలకు స్పెషల్ ఫండ్స్ మంజూరు చేయాలని కోరారు. బకాయిలు ఉన్న ప్రతీ గ్రామపంచాయతీకి ప్రభుత్వ పనుల చెల్లింపులు వాటికి అయిన నిధులు వెంటనే మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక సంఘం మెంబర్ సెక్రెటరీ స్మితా సబర్వాల్ మాట్లాడారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, ఆర్థిక సంఘం సభ్యులు రమేష్ నాయక్, నెహ్రూనాయక్, హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్, జిల్లా పరిషత్ సీఈవోలు, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి

ఆటోనగర్, ఆగస్టు 7: వరంగల్ కొత్తవాడలో ఉన్న చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకురాలు యెలుగం లీలావతి-సత్యనారాయణ అన్నారు. బుధవారం జాతీయ చేనేత కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తవాడలోని కొండా లక్ష్మణ్ బాపూజీ జంక్షన్ వద్ద గల నేత కార్మిక మగ్గం విగ్రహానికి లీలావతి కాంగ్రెస్ నాయకులు, చేనేత కార్మికులతో కలిసి పూలమాల వేసి మాట్లాడారు. కొత్తవాడ అంటేనే చేనేత కార్మికులకు పుట్టినిల్లు అని, రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం కొత్తవాడకు చెందిన చేనేత కార్మికులకు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యెలుగం సత్యనారాయణ, బాషకర్ల హరికృష్ణ, ఎల్.మొగిళి, రావుల రాజీవ్, అక్బర్, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

● చేనేత కార్మికులకు చేనేత బంధు ప్రకటించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ కొత్తవాడలో జాతీయ చేనేత కార్మిక దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకట్రాములు హాజరై మాట్లాడారు. నాయకులు కూచన సారయ్య, లింగబత్తిని రామకృష్ణ, శంకర్, సారయ్య, గుండా రమేష్, బాసబత్తిని శంకరయ్య, బొద్దుల భిక్షపతి, వల్లాల కిషోర్, ఈగ మొగిలయ్య, దూడం పెద్దులు పాల్గొన్నారు.

● పోచమ్మమైదాన్: ప్రధాని నరేంద్రమోదీ 2014లో ప్రకటించిన జాతీయ చేనేత దినోత్సవం పద్మశాలి కులస్థులకు గౌరవ సూచిక అని బీజే పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షుడు కుసుమ సతీష్ అన్నారు. గోపాలస్వామి గుడి చౌరస్తాలోని కొండా లక్ష్మణ్ బాపూజీ జంక్షన్‌లో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రత్నం సతీష్, వన్నాల వెంకటరమణ, బాకం హరిశంకర్, బైరి శ్యాంసుందర్, కూచన క్రాంతి, చిలువేరు రాజేందర్, ముంద్రాతి వెంకటేశ్వర్లు, కందిమల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలని పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ అన్నారు. 18వ డివిజన్ శివనగర్‌లోని పోపా జిల్లా కార్యాలయంలో గుండు కామేశ్వర్ అధ్యక్షతన జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని పద్మశాలీల ఇలవేల్పు మార్కండేయ చిత్రపటానికి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోపా నాయకులు గోసికొండ సుధాకర్, బైరి శ్యామసుందర్, శామంతుల కిరణ్, శ్రీధర్, పెద్దూరి పెద్దన్న, సుభాష్, రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నేత కార్మిక మగ్గం విగ్రహానికి పూలమాల వేస్తున్న లీలావతి, నాయకులు

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

సంగెం, ఆగస్టు 7: గ్రామాల అభివృద్ధిలో ప్రజలు, అధికారులు సమన్వయంతో భాగస్వాములు అవ్వాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం అధికారులతో కలిసి మొక్కలు నాటిన అనంతరం గ్రామస్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో పారిశుధ్యం లోపించినట్లు ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్థులు తీసుకువచ్చారు. ప్రజల జీవన విధానం మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. ఇందుకు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నడిపించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా నిరంతరం అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు.

భవిష్యత్‌లో గ్రామాలు స్వచ్ఛదనం-పచ్చదనంతో కొనసాగే విధంగా ప్రతి నెలా 3వ శనివారం ప్రత్యేక రోజుగా గుర్తించనున్నట్లు తెలిపారు. గ్రీనరీ పెంచడం వలన వాతావరణం కలుషితం కాకుండా ఉంటుందన్నారు. ప్రతి ఇంటిలో ఆరు మొక్కలు నాటే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంకులను విధిగా శుభ్రపర్చాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వేదవతి, ఎంపీడీవో కాసర్ల రవీందర్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీవో కొమురయ్య, ఏపీఎం కిషన్, కాంగ్రెస్ నాయకులు జనగాం రమేష్, మెట్టుపల్లి రమేష్, కందకట్ల నరహరి, సంధ్యారాణి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు

నిండుతున్న కుంటలు, చెరువులు

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 7: జిల్లా వ్యాప్తంగా బుధవారం చిరుజల్లులు కురువగా, ఖానాపూర్ మండలంలో భారీ వర్షం పడింది. అన్ని మండలాల్లో కలిపి 162మి.మీ. వర్షపాతం కురువగా జిల్లా సగటు వర్షపాతం 13మి.మీగా నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు నిండుతున్నాయి. పాకాల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 30 అడుగులు కాగా 29.9 అడుగులకు నీరు చేరింది. గీసుగొండలో 12.6 మి.మీ, దుగ్గొండి 13.6 మి.మీ, నల్లబెల్లి 8.0 మి.మీ, నర్సంపేట 14.4 మి.మీ, ఖానాపూర్ 35.4మి.మీ, చెన్నరావుపేట 15.4మి.మీ, సంగెం 6.4మి.మీ, వర్ధన్నపేట 4.8మి.మీ, రాయపర్తి 4.4మి.మీ, పర్వతగిరి 10.2మి.మీ, నెక్కొండ 10.0 మి.మీ, ఖిలావరంగల్ 14.0మి.మీ, వరంగల్ 19.6మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఆర్టీఏ కార్యాలయాన్ని సందర్శించిన డీటీసీ

ఖిలావరంగల్, ఆగస్టు 7: వరంగల్ జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల డీటీసీ పుప్పాల శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. నాయుడు పెట్రోల్ పంపు వద్ద గల ఆర్టీఏ కార్యాలయంలో కమిషనర్ తనిఖీ చేశారు. ఇటీవల కాలంగా జరుగుతున్న వాహనాల లైసెన్సులకు సంబంధించిన ఫైళ్లను ఆయన పరిశీలించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్సు కార్డుల విషయంలో జాప్యం జరుగుతున్న విషయమై సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం కార్యాలయానికి వచ్చే వివిధ వాహనాల డ్రైవింగ్ పరిశీలన అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. డ్రైవింగ్ తనిఖీల అనంతరం ఇచ్చిన గడువులోగా వాహనదారులకు లైసెన్సులను పోస్టులో అందేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు జయపాల్‌రెడ్డి, శోభన్ బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో ఇబ్బందులు రావొద్దు

జిల్లా కలెక్టర్ సత్యశారద



సీకేఎం ఆస్పత్రిలో శిశువు, బాలింతకు గిఫ్టులు అందజేస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 7: వైద్య సేవల విషయంలో రోగులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంజీఎం, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, నర్సంపేట నూతన ప్రభుత్వ ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్లు విధులను నిర్వహించడంతో బాధ్యత పూర్తయినట్లు కాదని, ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవల పరంగా అందే సేవలు, ఆస్పత్రి నిర్వహణ వ్యవస్థలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. నర్సింగ్ విద్యార్థుల హాస్టల్ షిఫ్టింగ్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపినందున వరంగల్ రాంకీ ఎన్‌క్లేవ్‌లోని భవనంలోకి మార్చేందుకు చర్యలు చేపట్టాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. నర్సంపేటలోని నూతన ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో ఎంజీఎం, కంటి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు భరత్ కుమార్, గోపాల్, కిషన్, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, ఆర్డీవో కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు అమృతం

గిర్మాజీపేట: తల్లి పాలు అమృతమని.. తల్లీ బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయని కలెక్టర్ సత్యశారద అన్నారు. బుధవారం వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో జిల్లా సంక్షేమ శాఖ, జాతీయ ఆయుష్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా ప్రసవాల వార్డుకు చేరుకున్న కలెక్టర్ సత్యశారద తల్లులతో ముచ్చటించారు. మీ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టారా.. అని కలెక్టర్ అడగగా బిడ్డ పుట్టిన గంటలోపే పట్టించామని చెప్పడంతో కలెక్టర్ చిరునవ్వుతో వారిని అభినందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.శర్మిల మాట్లాడుతూ తల్లిపాలు శిశువు మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడుతాయని చెప్పారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు తప్పనిసరిగా తల్లి పాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ రాజేశ్వరి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ లక్ష్మీదేవి, డాక్టర్ సువర్ణ, డాక్టర్ స్వర్ణసుధ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి హైమావతి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటమణ, నర్సింగ్ అధికారులు పాల్గొన్నారు.

కాగా, తల్లిపాల వారోత్సవం ముగింపులో భాగంగా అంతకుముందు వరంగల్ ప్రధాన తపాలా కార్యాలయం సెంటర్ నుంచి సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వరకు అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు.

పెరటి కోళ్ల పెంపకంతో జీవనోపాధి

కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న

శంభునిపేట, ఆగస్టు 7: పెరటి కోళ్ల పెంపకంతో జీవనోపాధి పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న అన్నారు. మామునూరులోని కేవీకేలో మలక్‌పల్లి గ్రామ రైతులకు పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ కార్యక్రమంలో బుధవారం డాక్టర్ రాజన్న పాల్గొని మాట్లాడారు. గ్రామీణ రైతులు ఇంటి దగ్గరే తక్కువ వ్యయంతో ఎక్కువ లాభాలు పొందే స్వయం ఉపాధిగా పెరటి కోళ్ల పెంపకాన్ని చేపట్టాలన్నారు. రాజశ్రీ, దేశవాళి కోళ్లతో పోల్చుకుంటే పెరటి కోళ్ల గుడ్లు, మాంసం ఉత్పత్తి అధికంగా ఉంటుందన్నారు. పెరటి కోళ్ల వల్ల కలిగే లాభాల గురించి రైతులకు వివరించారు. పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ పెరటి కోళ్లలో వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, చికిత్స వాటి నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. అనంతరం రైతులకు పెరటి కోళ్ల యూనిట్‌లను, దాణా, నీళ్లకోసం వినియోగించే ఫీడర్, డ్రింకర్‌లను అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు ప్రారంభం

తొలి బోనం సమర్పించిన శాలివాహనులు

శంభునిపేట, ఆగస్టు 7: శ్రావణ మాసం సందర్భంగా నగరంలో పోచమ్మ తల్లి బోనాల పండుగ ఘనంగా ప్రారంభమైంది. 41వ డివిజన్ శంభునిపేటలోని పోచమ్మ ఆలయంలో బుధవారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఆచారం ప్రకారం శాలివాహనులు(కుమ్మరి కులస్తులు) పోచమ్మ తల్లికి తొలి బోనం సమర్పించారు. భక్తులు డప్పుచప్పుళ్లతో బోనాలను ఎత్తుకొని ఆలయానికి చేరుకున్నారు. గ్రామంలో జోగు రూపేనా సేకరించిన పసుపు, బియ్యం పూజా ద్రవ్యాలతో తమ పూజా సామగ్రిని జత చేసి శాలివాహన పూజారులు మట్టి పాత్రలో వండిన (నైవేద్యాన్ని) అమ్మ వారికి బోనంగా సమర్పించారు. అంతకు ముందు అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శి జనార్దన్, చక్రపాణి, రాజు, ప్రకాశ్, ముఖేష్, శరత్ చంద్ర, వీరమ్మ, రాజమణి, భాగ్య, భక్తులు పాల్గొన్నారు. అలాగే 43వ డివిజన్ సత్యసాయినగర్‌లోని పోచమ్మ ఆలయంలో పూజారి రమణాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు నైవేద్యాలు, బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో రంగశాయిపేట కాలనీల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కర్నె రవీందర్, అనుమాసు రాంబాబు, తరుగల శ్రీధర్, శ్రీనివాస్ గుప్తా, రాజ్‌కుమార్, రవిచందర్, రాజేశ్వర్, రాము, ఉదయకుమార్, సదానందం, రాజేందర్, అంకయ్య, పవన్, భక్తులు పాల్గొన్నారు.

● గిర్మాజీపేట: శ్రావణ మాసం పోచమ్మ బోనాలు బుధవారం నగరంలో ప్రారంభమయ్యాయి. రైల్వేస్టేషన్ రోడ్డులోని పోచమ్మ దేవాలయంలో తొలి బోనంను ఓరుగంటి వంశ పెద్దలు ఓరుగంటి రాజేందర్, చరణ్, చిరంజీవి, రామకృష్ణ, రంజిత్ కుటుంబ సభ్యులు సమర్పించారు. స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ 27వ డివిజన్ ప్రజలంతా ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని పోచమ్మ తల్లికి మొక్కులు సమర్పించుకున్నారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పోచమ్మమైదాన్, ఆగస్టు 7: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల సభలో ప్రకటించిన విధంగా ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రధాన హామీలైన అంబేద్కర్ అభయహస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు, షెడ్యూల్డ్ కులాల సాంఘీక సంక్షేమ వసతి గృహాల పునఃనిర్మాణం, ప్రతి ఎస్సీ కుటుంబానికి శాశ్వత ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సాయం తదితర హామీలను వెంటనే అమలు చేయాలని రవి కుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, వన్నాల వెంకటరమణ, బన్న ప్రభాకర్, పోలెపాక మార్టిన్ లూథర్, మాదాసు రాజు, జన్ను సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సాధన కోసం పోరాటం

వరంగల్ తూర్పు దినపత్రికల జర్నలిస్టుల సంఘం ఏర్పాటు

ఖిలావరంగల్, ఆగస్టు 7: వివిధ దినపత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యల సాధన కోసం పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని కన్వీనర్ అలువాల సదాశివుడు అన్నారు. బుధవారం శివనగర్ లోని సాయి కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ తూర్పు దినపత్రికలలో పనిచేసే జర్నలిస్టుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో దినపత్రికల ఉనికి తగ్గిపోతుందన్నారు. అనేక సంవత్సరాలుగా పత్రికా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు కోసం అధికార పార్టీ నేతలను, ప్రభుత్వ పాలనా యంత్రాంగాన్ని కలిసి పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. అనంతరం వరంగల్ తూర్పు దినపత్రికల జర్నలిస్టు సంఘం అడ్‌హక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా అలువాల సదాశివుడు, కోకన్వీనర్లుగా కొత్త రమేష్, బజ్జూరి ప్రభాకర్, కర్పన స్వామి చిన్నబాబు, షైదం వెంకన్న, బాదావత్ బాలాజీ, ఈద శ్రీనాథ్, ఈర్ల సురేందర్, మెరుగు అశోక్ ఎన్నికయ్యారు. సమావేశంలో జర్నలిస్టులు వి.రాంచందర్, బి.శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, బి.వెంకటేశ్వర్లు, వి.శ్రీనివాస్, కె.రమేష్, టి.నరేష్, ఆర్.ఉపేందర్, ఎమ్డీ.జాఫర్, పి.వేణు, కె.భరత్, బి.కిరణ్, ఆర్.నరేష్, పి.నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనంను విజయవంతం చేయాలి



ఊకల్‌లో మొక్క నాటుతున్న సీఈవో రాంరెడ్డి

గీసుగొండ, ఆగస్టు 7: మొక్కలు విరివిగా నాటి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలని జడ్పీ సీఈవో రాంరెడ్డి అన్నారు. మండలంలోని ఊకల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని వివరించారు. మరియపురంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో ప్రభాకర్, ఎస్ఐ కుమార్, కార్యదర్శులు శ్రీధర్, సరిత పాల్గొన్నారు. కాగా, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పరిశీలించేందుకు రాష్ట్ర ప్రత్యేక అధికారి ముంద్రాతి హరిత గీసుగొండకు గురువారం వస్తున్నట్లు ఎంపీడీవో కమలాకర్ తెలిపారు.

● వరంగల్ కల్చరల్: స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో ప్రజలందరు భాగస్వాములు కావాలని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అన్నారు. భద్రకాళి అమ్మవారి దేవాలయ ప్రధాన ఆర్చి వద్ద స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శేషుభారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, సీఐ తుమ్మ గోపి, ఆలయ పర్యవేక్షకులు అద్దంకి విజయ్‌కుమార్, కేఎంసీ ఫిజికల్ డైరెక్టర్ తుమ్మ ప్రభాకర్‌రెడ్డి, ఎస్సై, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● గిర్మాజీపేట: నగరంలోని 27వ డివిజన్ కొండా పటేల్ కాలనీ(ఎల్‌వీఆర్ నగర్ కాలనీ)లో కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానికులు, గ్రేటర్ బల్దియా సిబ్బంది మురికినీరు తొలగించి శుభ్రం చేశారు. కార్పొరేటర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే కాలనీలో విషజ్వరాలు ఎవరికి రావన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారి సురేష్, ప్రత్యేకాధికారి ఫణికుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి, కొండా పటేల్‌కాలనీ వాసులు సదానందం, బానోత్ కపూర్, సుదర్శన్, శైలజ, అనసూర్య, లక్ష్మి, శ్రీను, స్వరూప, తోగరు లక్ష్మి, గ్రేటర్ బల్దియా ప్రజారోగ్య సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని కార్పొరేటర్లు అన్నారు. అండర్ రైల్వేగేట్ ప్రాంతంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ అధికారులు, కార్పొరేటర్లు నిర్వహించారు. 18, 34, 35, 37, 38 డివిజన్ క్రిస్టియన్‌కాలనీ, ఖిలావరంగల్ తూర్పుకోట, పడమరకోట, శివనగర్, తదితర ప్రాంతాలలో డ్రైయినేజీల్లోని చెత్తను తొలగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వస్కుల బాబు, దిడ్డి కుమారస్వామి, సోమిశెట్టి ప్రవీణ్, వేల్పుల సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమదామోదర్ తదితరులు పాల్గొన్నారు.

● శంభునిపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యత అని, అందులో ప్రజలు భాగస్వామ్యం అవ్వాలని 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని పలు కాలనీల్లో పరిసరాలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ ఆధ్వర్యంలో వినాయకనగర్ కాలనీలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. కాలనీల్లో బురదమయమైన రోడ్లపై మట్టి పోయించి చదును చేయించారు. కార్యక్రమంలో నక్క కొమురెల్లి యాదవ్, స్పదన్, ఆర్ఐ లింగమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వేణు, జవాన్లు కృష్ణ, కిరణ్, కృపదానం, రాజమౌళి, మునిసిపల్ సిబ్బంది, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

మాధన్నపేట చెరువుకు జలకళ


మత్తడిపోస్తున్న మాధన్నపేట చెరువు

నర్సంపేట టౌన్, ఆగస్టు 7 : మండలంలోని మాధన్నపేట చెరువు వరద నీటితో జలకళ సంతరించుకుంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువు బుధవారం ఆరు ఇంచులతో అలుగు పోస్తున్నది. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. మండలంలోని ప్రధాన చెరువు మాధన్నపేట చెరువునీటి సామర్థ్యం 17 అడుగులు కాగా, బుధవారం నాటికి 17 అడుగులకు పైగా నీటి మట్టం చేరుకోవడంతో మత్తడిపోస్తున్నది. దీంతో ఖరీఫ్‌లో వరి సాగుకు ఢోకాలేకపోవడంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'శ్రేష్ట' ర్యాంకర్‌కు ఏపీలోని నర్సాపురంలో సీటు

అడ్మిషన్‌కు పాఠశాల యాజమాన్యం నిరాకరణ
స్కూల్ ఎదుట విద్యార్థి తల్లి ఆందోళన
జనసేన నాయకుల చొరవతో పాఠశాలలో అడ్మిషన్


అడ్మిషన్ పొందిన విద్యార్థి తేజు

నర్సంపేట టౌన్, ఆగస్టు 7 : దేశ వ్యాప్తంగా ఎస్సీ విద్యార్థులకు సీబీఎస్ఈ అనుబంధ ప్రముఖ రెసిడెన్సీ పాఠశాలల్లో 9, 11 తరగతుల ప్రవేశాలకు నిర్వహించిన ఆల్ ఇండియా శ్రేష్ట పరీక్షలో 997వ ర్యాంకును నర్సంపేట పట్టణానికి చెందిన ఇస్రం తేజు సాధించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంలోని జె.సికిలి పాఠశాలలో 9వ తరగతిలో అడ్మిషన్ పొందేందుకు సీటు వచ్చింది. ఈ పాఠశాలలో అడ్మిషన్ పొందేందుకు తల్లి ఇస్రం స్వాతితో కలిసి ఆ పాఠశాలకు బుధవారం వెళ్లాడు. భాష, ప్రాంతం, ఆర్థిక తదితర వైషమ్యాలతో అడ్మిషన్ ఇవ్వడానికి పాఠశాల యాజమాన్యం నిరాకరించింది. దీంతో విద్యార్థి తేజు, అతని తల్లి పాఠశాల ఎదుట ఆందోళనచేశారు.విషయం తెలుసుకున్న జనసేన నర్సంపేట నా యకుడు శివకోటి జనసేన తెలంగాణ నాయకుడు ములుకుంట్ల సాగర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన సాగర్ నర్సాపురం జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌తో మాట్లాడడంతో ఎమ్మెల్యే పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి అడ్మిషన్ఇప్పించారు.

'న్యాయం జరగకుంటే ఆందోళనలు చేస్తాం'


విచారణలో గోడు వెల్లబోసుకుంటున్నరైతులు

నల్లబెల్లి, ఆగస్టు 7: రుణమాఫీలో నల్లబెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా తమకు జరిగిన అన్యాయంలో న్యాయం జరగకుంటే ఆందోళనలు ప్రారంభిస్తామని బాధిత రైతులు మామిండ్ల ఐలయ్య, నానబోయిన రవిలు అన్నారు. బుధవారం రుణమాఫీ బాధిత రైతులు నల్లబెల్లి సొసైటీ కి వచ్చి విచారణ ప్రత్యేక అధికారి కీరు నాయక్, ఎస్సై ప్రశాంత్‌బాబు, సొసైటీ ఛైర్మన్, చెట్టుపల్లి మురళిల ముందు తమకు జరిగిన అన్యాయాన్ని తెలిపారు. రైతులు మామిండ్ల ఐలయ్య, నానబోయిన రవిలు మాట్లాడుతూ ఆధార్ కార్డు నంబర్లతో రుణమాఫీలో తప్పిదం జరిగిందంటున్నారు. అసలు తమ ఆధార్ కార్డులు సొసైటీ అధికారికి సిబ్బందికి ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఆధార్ కార్డులతో ఇష్టనుసారంగా సభ్యత్వంలేని వారికి అప్పు ఇచ్చినట్టు, సొసైటీలో అప్పున్న వారికి అదనంగా అప్పు ఎక్కువగా చూపించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నిం చారు. కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ రాజు ఎందుకు ఆఫీస్‌కు రావడం లేదు, సీఈవో మొగిళి ఎక్కడున్నాడని, ఎందుకు రాలేదని ఛైర్మన్ మురళిని నిలదీశారు. సొసైటీలో రైతులకు ఆధార్ కార్డు నంబర్లతో జరిగిన తప్పిదాలపై సమగ్ర విచారణ చేపట్టి ప్రభుత్వం ద్వారా న్యాయం చేస్తామని విచారణ అధికారి కీరునాయక్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులు పరిశీలించి న్యాయం చేస్తామని ఎస్సై ప్రశాంత్‌బాబు తెలిపారు.

చేనేత రంగాన్ని ఆదుకోవాలి

నర్సంపేట, ఆగస్టు 7 : చేనేత రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలని నర్సంపేట పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు రుద్ర ఓంప్రకాశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో జాతీయ చేనేత దినోత్స వాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చేనేతకు సంబంధించి నూలుపై రాయితీ ఇవ్వాలని, చేనేత కార్మిక కుటుంబాలకు ఇచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం నాయకు లు కోదాటి వీరస్వామి, పట్టణపద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కూచన శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీరాముల శంకరయ్య, ముఖ్య సలహాదారులు గడ్డం రాజేందర్, ఉపాధ్యక్షుడు మేరుగు సాంబయ్య, కోదాటి మోహన కృష్ణ, కూచన రవీందర్, యువజనసంఘం ప్రధాన కార్యదర్శి పర్శ శ్రీధర్, గాజుల రమేశ్, కోడూరి రవి, కామని రవీందర్, పెండెం వెంకటేశ్వర్లు, గాజుల రాము, అడ్డగట్ల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తీరనున్న పారిశుధ్య సమస్య


ఇల్లందలోని ప్రభుత్వ పాఠశాల

వర్ధన్నపేట, ఆగస్టు 7: పాఠశాలలు, స్వచ్ఛతకు చిరునామాగా ఉండాలి. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పాఠశాలల్లో పరిశుభ్రతకు నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కారం కానున్నాయి. పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఆవరణ శుభ్రం చేసే వారు లేకపోవడంతో అధ్వానంగా చెత్తాచెదారంతో నిండి ఉంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొంతకాలంపాటు స్కావెంజర్లను నియమించి అనంతరం వారిని తొలగించారు. అప్పటి నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీ ల్లోని పారిశుధ్య కార్మికుల సేవలు కొంత కాలం ఉప యోగించుకున్నా పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారం కాలేదు. కార్మికులు అప్పుడప్పుడు మాత్రమే వచ్చి నామమాత్రంగా పనులుచేసేవారు. దీంతో ఉపాధ్యాయులు వారిపై సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదులుచేసినా ఫలితంలేదు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

అమ్మ ఆదర్శ కమిటీలకు బాధ్యతలు

ప్రస్తుతం అమ్మ ఆదర్శ కమిటీలకు పరిశుభ్రత బాధ్యతను అప్పగించారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పాఠశాలలకు ప్రతీ యేటా వచ్చే నిర్వహణ నిధులకు అదనంగా వీటిని కేటాయిస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం పాఠశాలలు అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో ప్రగతి పనులు పర్యవేక్షిస్తున్నారు. ఇపుడు వారి ఆధ్వర్యంలోనే పరిశుభ్రత పనులు చేయనున్నారు.మరుగుదొడ్లు శుభ్రం చేయడం, పాఠశాల ఆవరణను శుభ్రం చేయడంతోపాటు మొక్కలకు నీరుపోయడం వంటి పనులను చేయాల్సి ఉంటుంది.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

విద్యార్థుల సంఖ్యను ఆధారంగా చేసుకుని ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. 30మందిలోపు ఉంటే రూ.3 వేలు, 31 నుంచి 100 మంది ఉంటే రూ.6వేలు, 101 నుంచి 250 మంది ఉంటే రూ.8వేలు, 251 నుంచి 500 లోపు ఉంటే రూ.12వేలు, 501నుంచి 750 మంది ఉంటే రూ.15వేలు, 750 కంటే ఎక్కువగా ఉన్న పాఠశాలలకు రూ.20వేల చొప్పున నిధులు ఇవ్వనుంది. ఏడాదికి సరిపడే నిధులను ఒకేసారి విడుదల చేయనుండడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గాన్ని ముందంజలో ఉంచేందుకు కృషి

▸▸ ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, ఆగస్టు 7 : వర్ధన్నపేట నియజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించి ముందంజలో ఉంచేందుకు అహర్నిశలు కృషిచేస్తున్నానని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. బుధవారం వర్ధన్నపేట పట్టణ పరిధిలోని దుర్గమ్మగుడి నుంచి గుబ్బెటతండా, దుబ్బతండా మీదుగా రోడ్డు అభివృద్ధి కోసం రూ.3 కోట్లతో చేపట్టిన పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు హామీ ఇచ్చి శిలాఫలకాలకే పరిమితం చేశారని గిరిజనుల కష్టాలను గమనించి నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. అనంతరం వర్ధన్నపేట పట్టణంలో వాటర్ ట్యాంకు నిర్మాణం కోసం అధికారులను అడిగి తెలుసుకున్నారు.

తల్లిపాల వారోత్సవాల్లో..

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగరాజు హాజరై మాట్లాడారు. తల్లిపాలతో చిన్నారులకు వచ్చే ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు ఈ వారోత్సవాలు ఎంతో దోహదపడతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలందరూ ఉపయోగించుకుని బలవర్ధకమైన ఆహారాన్ని అందిపుచ్చుకోవాలన్నారు.

ఆకేరువాగు అక్విడేట్ పరిశీలన

వర్ధన్నపేట కోనారెడ్డి చెరువుకు వచ్చే నీటిని కోనాయిచలం వద్ద నిర్మించిన అక్విడేట్‌ను పరిశీలించి 12 కిలో మీటర్ల కాలువ మరమ్మతులు చేయించడానికి ప్రొక్లెయిన్‌తో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోనారెడ్డి చెరువు గత ప్రభుత్వహయాంలో అందినంత దండుకుని తూతూ మంత్రంగా పనులు చేయడంతో కోనారెడ్డి చెరువుకు నీరువచ్చే అవకాశంలేదని రైతులు తన దృష్టికి తీసుకురావడంతో 12కిలో మీటర్ల కాలువను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధంచేసి అందుకు అనుగుణంగా ముందుకు సాగుతున్నామన్నారు. కోనారెడ్డి చెరువు నిండినట్లయితే వర్ధన్నపేటతోపాటు పలు గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగి తాగు, సాగు నీటికి ఇబ్బందులులేకుండా ఉంటుందన్నారు.ఎమ్మెల్యే వెంట బ్లాక్, మండల పార్టీల అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి, ఎద్దు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు మైస సురేష్ కుమార్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 7: జిల్లా వ్యాప్తంగా బుధవారం చిరుజల్లులు కురువగా, ఖానాపూర్ మండలంలో భారీ వర్షం పడింది. అన్ని మండలాల్లో కలిపి 162మి.మీ. వర్షపాతం కురువగా జిల్లా సగటు వర్షపాతం 13మి.మీగా నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు నిండుతున్నాయి. పాకాల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 30 అడుగులు కాగా 29.9 అడుగులకు నీరు చేరింది. గీసుగొండలో 12.6.మి.మీ, దుగ్గొండి 13.6 మి.మీ, నల్లబెల్లి 8.0 మి.మీ, నర్సంపేట 14.4 మి.మీ, ఖానాపూర్ 35.4మి.మీ, చెన్నరావుపేట 15.4మి.మీ, సంగెం 6.4మి.మీ, వర్ధన్నపేట 4.8మి.మీ, రాయపర్తి 4.4మి.మీ, పర్వతగిరి 10.2మి.మీ, నెక్కొండ 10.0మి.మీ, ఖిలావరంగల్ 14.0మి.మీ, వరంగల్ 19.6మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు కోసం వెంకటేశ్వర తండావాసుల ధర్నా


రహదారిపై ధర్నాచేస్తున్న గిరిజనులు

వర్ధన్నపేట, ఆగస్టు 7: పట్టణ పరిధిలోని వెంకటేశ్వరతండావాసులు తమ ఇళ్లకు వెళ్లాలంటే సరిగా రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, పలుమార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఫలితం దక్కకపోవడంతో ఆగ్రహంవ్యక్తంచేస్తూ వర్ధన్నపేట సంగెం వాగు వద్ద వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచి ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇదే సమయంలో స్థానిక ఎమ్మెల్యే ఈ ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో పోలీసులు క్లియరెన్స్ చేసి పంపించారు. తండావాసులు ప్రభుత్వం దృష్టికిసమస్యను తీసుకువెళ్లి పనులు చేపట్టేలా చూడాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీసులు సర్దిచెప్పడంతో గిరిజనులు ఆందోళన విరమించారు. ఈ ధర్నాలో గుగులోత్ అనిత, కముషమ్మ, రాజమ్మ, శ్రీను, హేమ్లా, వినోద, జ్యోతి, బాలాజీ, సంతోష్, చిన్నబాలాజీ, చందు, మల్లేష్, రాధ, రమేష్ తదితరులు ఉన్నారు.

వైద్య సేవల్లో ఇబ్బందులు రావొద్దు : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 7: వైద్య సేవల విషయంలో రోగులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంజీఎం, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, నర్సంపేట నూతన ప్రభుత్వ ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేసే పర్యవేక్షణ బాధ్యత జిల్లా కలెక్టర్‌గా తనపై ఉందని తెలిపారు. డాక్టర్లు విధులను నిర్వహించడంతో బాధ్యత పూర్తయినట్లు కాదని, ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవల పరంగా అందే సేవలు, ఆస్పత్రి నిర్వహణ వ్యవస్థలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నర్సింగ్ విద్యార్థుల హాస్టల్ షిఫ్టింగ్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపినందున వరంగల్ రాంకీ ఎన్‌క్లేవ్‌లోని భవనంలోకి మార్చేందుకు చర్యలు చేపట్టాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. నర్సంపేటలోని నూతన ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో ఎంజీఎం, కంటి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు భరత్ కుమార్, గోపాల్, కిషన్, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, ఆర్డీవో కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండలో రైల్వే ఉన్నతాధికారుల పరిశీలన


పరిసరాలను పరిశీలిస్తున్న రైల్వే ఉన్నతాధికారులు

నెక్కొండ, ఆగస్టు 7: నెక్కొండ రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇప్పించడంతోపాటు రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కరించ డానికి రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ ఆదేశాల మేరకు రైల్వే ఉన్నతాధికారులు బుధవారం నెక్కొండ స్టేషన్‌లో పర్యటించారు. ఈ నెల 1వ తేదిన మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో మంత్రిని కలసి వినతి పత్రం అందించారు. ఈ మేరకు నెక్కొండ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ కోసం నిత్యం ఎంత మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. ఈ స్టేషన్ పరిసరాల్లో ఉన్న మండలాలు, గ్రామాల సంఖ్య తెలుసుకున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మూడో ప్లాట్‌ఫామ్ నుంచి పోలీస్ స్టేషన్ వైపుకు ఫుట్‌వోవర్ బ్రిడ్జి నిర్మాణం, ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్ నుంచి రెండో నంబరు ప్లాట్‌ఫామ్ వరకు పాత్‌వేలను నిర్మాణం చేయిస్తామన్నారు. స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను అధికారుల బృందం సభ్యులు పరిశీలించారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. సమస్యలు త్వరలో పరిష్కరమవుతాయంటూ అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. డిప్యూటీ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ వెంకన్న, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రామారావు, ఏసీఎం ఎల్ఎస్ఆర్ మూర్తి, రైల్వే అధికారులు రాజగోపాల్, షఫీ తదితరులు పర్యటించారు. రైల్వే ఉన్నతాధికారులకు నర్సంపేట టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, రైల్వేఫోరం అవేర్నెస్ కన్వీనర్ వెంకటనారాయణ, మార్కెట్ ఛైర్మన్ హరిశ్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు రమేశ్, అశోక్, వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, రాంగోపాల్, చెన్నకేశవులు, సుబ్బారెడ్డి, మాణిక్యం, సారంగపాణి, సాయికృష్ణ వినతి పత్రాన్ని ఇచ్చారు.

నేటి నుంచి ఇంటర్‌సిటీ హాల్టింగ్

సికింద్రాబాద్-గుంటూరు(12705/12706) ఇంటర్ సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నెక్కొండ రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇస్తున్నట్లు డీఆర్ఎమ్ బుధవారం సాయంత్రం జారీ చేసిన జీవోలో పేర్కొన్నారు. జూన్ 30వ తేదినుంచి నెక్కొండస్టేషన్‌లో ఇంటర్‌సిటి హాల్టింగ్‌ను రద్దు చేయడంతో రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్‌కు ఎంపీ బలరాంనాయక్, నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి, నర్సంపేట టీపీసీసీ మెంబర్ రంజిత్‌రెడ్డి వినతి పత్రంఇవ్వగా, నెక్కొండ మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్ సికింద్రాబాద్ రైల్ నిలయంలో జూన్30న సీనియర్ డివిజనల్ వాణిజ్య మేనేజర్ వై.బాలాజీకిరణ్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఇంటర్ సిటి హాల్టింగ్ ఇవ్వడంతో వివిధ పార్టీల నాయకులు నెక్కొండలో బాణసంచాలు పెల్చి సంబరాలను జరిపారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ నాయులు

నర్సంపేట, ఆగస్టు 7 : కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు, బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం సత్యా గ్రహ దీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే సత్యా గ్రహ దీక్షను విజయవంతం చేయడానికి పార్టీలకతీతంగా అన్ని బీసీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో మచ్చిక రాజుగౌడ్, కందికొండ శ్రీనివాస్, గుడికందుల సనత్ కుమార్, పెండ్యాల నర్సయ్య, ఆలేటి శివ, సాంబరాతిరాజు, రాకేశ్, మల్యాల సుమన్, బోళ్లరంజిత్, క్రాంతి పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న న్యాయవాది అంబటి శ్రీనివాస్

నర్సంపేట, ఆగస్టు 7 : న్యాయవాదులపై దాడులు చేసిన వారిపై, న్యాయవాదుల పట్ల అనుచితంగా వ్యవహరించిన పోలీసులపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీనియర్ న్యాయవాది అంబటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జనగామ పోలీస్‌స్టేషన్‌కు ఒక క్లయింట్ కేసుకు సంబంధించిన విషయంపై వెళ్ళిన న్యాయవాదులు అమృతరావు, కవిత దంపతుల పట్ల అక్కడి ఎస్సై, సీఐలు అనుచితంగా వ్యవహరించి వారిని కొట్టడాన్ని నిరసిస్తూ బుధవారం కోర్టు విధులను బహిష్కరించినట్లు అంబటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సివిల్ కేసుల్లో పోలీసులు తలదూర్చవద్దన్న నిబంధనలు ఉన్నాయన్నారు. పోలీసుస్టేషన్‌లకు వెళితే అధికార పార్టీ అనుయాయులు చెప్పిన వారికే పోలీసులు వత్తాసు పలకడం వల్ల బాధితులు అన్యాయానికి గురవుతున్నారని ఆరోపించారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, చట్టాన్ని చేతిలోకి తీసుకొని పరువుకు భంగం కల్పించిన వారెవరైనా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులకు విస్తృత అధికారాలు ఇవ్వడంవల్ల అధికార పార్టీకి చెందిన వారు చెప్పిన వారికే న్యాయం జరుగుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక న్యాయవాదులపై దాడులు పెరిగిపోయాయని అన్నారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలని ఆయన కోరారు. జనగామ పోలీసుస్టేషన్‌లో న్యాయవాదులు అమృతరావు, కవిత దంపతులను అక్కడి ఎస్సై, సీఐలు అవమానించి కొట్టిన సంఘటనను నర్సంపేట బార్ అసోసియేషన్ ఖండిస్తుందని, ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపాక రవి కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేశ్ యాదవ్, మోటూరి రవి, సిలువేరు కిరణ్, అంబటి రాజ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్తడి పోస్తున్న రంగాయ చెరువు



నల్లబెల్లి, ఆగస్టు 7 : మండలంలో అతిపెద్ద చెరువు అయిన రంగాయ చెరువు బుధవారం మత్తడి పోస్తుండడంతో మండలంలోని అన్నదాతలు ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఇటీవల ఏకధాటిగా కురుస్తున్న ముసురు, భారీ వర్షాలకు మండలంలోని కొన్ని చిన్న చిన్న చెరువులు, కుంటలు మత్తడి పోస్తున్నాయి. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రంగాయ చెరువు మత్తడి పోస్తుండడంతో ఇక వరి రబీ, యాసంగి రెండు పంటలకు తిరుగులేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తల్లిపాల వారోత్సవాల ముగింపు


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సీడీపీవో

నర్సంపేట, ఆగస్టు 7: తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో మధురిమ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న మహిళలకు పండ్లు, పిల్లలకు దుస్తులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు చాలా గొప్పగా ఉంటాయన్నారు. పిల్లల తల్లులకు అవగాహన కల్పించడంలో ఐసీడీఎస్, వైద్యశాఖల సమన్వయం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమం అనంతరం మునిసిపల్ కార్యాలయంలో ఆర్‌పిలు, ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మధురిమ మాట్లాడుతూ బిడ్డపుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో హేమలత, కౌన్సిలర్లు ఓర్సు అంజలి, రాయిడి కీర్తిరెడ్డి, శీలం రాంబాబు, ఎలకంటి విజయ్‌కుమార్, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు ఆడెపె రమాదేవి, హెల్త్ ఎడ్యు కేటర్ మార్త, ఏఎన్ఎమ్ కవిత, మురళి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

• దుగ్గొండి: అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవంలో


ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు

భాగంగా తిమ్మంపేటలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల టీచర్ల ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. జన్మించిన శిశువుకు 6 నెలల వరకు తల్లి పాలు అందించాలని, ముర్రుపాలు పట్టడంతో వ్యాధుల నుంచి రక్షణపొందవచ్చనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అంగన్‌వాడీ టీచర్లు బొది అరుణాదేవి, సోమ స్వరూప. ఆయా రమాదేవి, ఆశ కార్యకర్తలు రమ, శారద, విజయ. ఎన్‌జీవోఎస్ సీఎంఎస్ మోడెం ప్రశాంతి, పిల్లల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

అంబేద్కర్ అభయ హస్తాన్ని ప్రతీ కుటుంబానికి వర్తింపచేయాలి

వర్ధన్నపేట, ఆగస్టు 7 : అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని ప్రతీ కుటుంబానికి వర్తింపచేసి రూ.12లక్షల ఆర్థిక సహాయాన్ని అందించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఐత రవి డిమాండ్ చేశారు. బుధవారం వర్ధన్నపేట మండల కేంద్రంలో సమావేశం నిర్వహించిన అనంతరం స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా శ్రేణులు చీపురు వెంకటస్వామి, కొండేటి బాబు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి పనుల వివరాలు పూర్తి సమాచారం భద్రపరుచుకునేలా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలోని ఆస్తి పన్నుపై మళ్లీ పూర్తి సమీక్ష చేయాలన్నారు. విద్యుత్ చార్జీల అధిక బారం పడకుండా ప్రతీచోట సోలార్ పవర్ ప్లాంట్లను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతీ గ్రామ పంచాయతీలో క్రమం తప్పకుండా ప్రతీ 60 రోజుల్లో గ్రామసభ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్య, ఇతర అభివృద్ధి పనులకు సకాలంలో నిధులు అందుబాటులో ఉన్నట్లయితే ప్రతీ పనిని త్వరితగతిన పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా ఆర్థిక సంఘం జిల్లాలకు స్పెషల్ ఫండ్స్ మంజూరు చేయాలని కోరారు. బకాయిలు ఉన్న ప్రతీ గ్రామపంచాయతీకి ప్రభుత్వ పనుల చెల్లింపులు వాటికి అయిన నిధులు వెంటనే మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక సంఘం మెంబర్ సెక్రెటరీ స్మితా సబర్వాల్ మాట్లాడారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, ఆర్థిక సంఘం సభ్యులు రమేష్ నాయక్, నెహ్రూనాయక్, హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్, జిల్లా పరిషత్ సీఈవోలు, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.